క్లుప్తంగా

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



బూరుగుపూడిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నీరజ

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి ఎస్సీపేటలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద డాక్టర్ ఎం.నీరజ 49 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆయుర్వేదంతో కలిగే ప్రయోజనాలపై రోగులకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది అచ్చమాంబ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర లింగార్చన



రత్నగిరిపై సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పుష్య బహుల త్రయోదశి, మాసశివరాత్రిని పురస్కరించుకుని గురువారం రత్నగిరిపై సహస్ర లింగార్చన నిర్వహించారు. ఉదయం పండితులు దర్బారు మండపంలో మట్టితో 1008 శివలింగాలను చేసి వాటికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ప్రసాదాలు నివేదించి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు దత్తాత్రేయ శర్మ, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'



ఏలేశ్వరంలో పల్లెకు పోదాం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

ఏలేశ్వరం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఏలేశ్వరం పట్టణంలో నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు అధ్వర్యంలో గురువారం స్థానిక బాలాజీ చౌక్ సెంటర్ వద్ద పల్లెకు పోదాం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో మూడు రోజుల పాటు పార్టీ శ్రేణులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తామన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టెం వెంకటరమణ, కర్రి ధర్మరాజు, గట్టెం గంగాధర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనే లక్ష్యం

తుని: ఉత్తరాంధ్రాను ప్రత్యేక రాష్ట్రం చేయడమే తమ లక్ష్యమని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు అన్నారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్రలో భాగంగా గురువారం స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్లో ఆయన ప్రసంగించారు. ఉత్తరాంధ్ర ప్రత్యేకరాష్ట్రం కోసం శాంతియుత ఉద్యమం మొదలైందని, దానికి ప్రజల మద్దతు కావాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి జిలాల నుంచి ఉత్తరాంధ్రాకు తాగునీరు అందించే సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేయాలని, ఉత్తరాంధ్ర ప్రజల వలసలు నివారించాలని, ఉత్తరాంధ్రాలో వలస నాయకులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్ల ఆందోళన

తుని: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా నిర్బంధించడం, పోలీసు స్టేషన్లకు తరలించడం హేయమైన చర్య అని ఆశ వర్కర్ల సంఘ నాయకులు భవానీ, రామలక్ష్మి, సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా మహిళా పోలీసులు ఆశ వర్కర్లను భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు ధనలక్ష్మి, నాగేశ్వరరావు, రమణ, సీతారాత్నం, సంతోషి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు షర్మిల బహిరంగ సభ

తుని: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల తునిలో శుక్రవారం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎంఎం పల్లంరాజు కోరారు. గురువారం తునిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండు రంగారావుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్‌లోని బహిరంగ సభలో షర్మిల ప్రసంగిస్తారన్నారు. రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రగతిని కోరుకునే అందరూ బహిరంగ సభకు తరలి రావాలని ఆయన కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- లింగంపర్తిలో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



లింగంపర్తిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో మహిళలకు గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని 893 డ్వాక్రా సంఘాలకు చెందిన 8930 మంది మహిళలకు రూ.7.69 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగేళ్లలో మండల పరిధిలోని 8930 మంది మహిళలకు రూ.30.76 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మహిళలందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వరుపుల రాజబాబు, అడపా పార్థసారథి, కూనపురెడ్డి సుబ్బారావు, పీతల నూకరాజు, పసల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

తుని రూరల్: ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని, పెళ్లిళ్ల పేరుతో వారిని చదువులకు దూరం చేయడం తగదని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. మండలంలోని రాజుపేటలో శుక్రవారం సర్పంచ్ బుద్దాల సత్తిబాబు అధ్యక్షతన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను రక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసి బాలికలకు బాల్యాన్ని దూరం చేయ వద్దన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల, రక్త హీనత సమస్యలు వస్తాయన్నారు. అమ్మాయిల చదువు ఇంటికి వెలుగు నిస్తుందన్నారు. 22 సంవత్సరాలు వరకు చదివించాలని సూచించారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీటీసీ గింజాల సుబ్రహ్మణ్వేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డాది యేసుబాబు, కిల్లాడ గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంవీటీ కుమారి, బాల వెంకటేశ్వరి, లోవరాణి పాల్గొన్నారు.

చంద్రబాబు తీరు సిగ్గుచేటు

తుని: ఏపీకి ద్రోహం చేసిన బీజేపీ పెద్దల కాళ్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పట్టుకోవడం సిగ్గు చేటు అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. గురువారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులపై చర్చించడానికి ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కాళ్లు మీద పడి తెలుగువారి ఆత్మగౌరవం, పరువు తీశారన్నారు. తెలుగు ప్రజల ప్రతిష్టను మంట కలిపిన చంద్రబాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తున్న, మానవ హక్కులను కాలరాస్తున్న బీజేపీకి, వాళ్లతో కలిసి పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో దళిత బహుజనులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల పరిశీలన



పాతకొట్టాంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: మండలంలోని కేపీ మల్లవరం, కేఓ అగ్రహారం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్లీపేట గ్రామ సచివాలయాల్లో పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. కాగా గురువారం ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరు, సాంకేతిక ఇబ్బందులపై సిబ్బందిని ఆరా తీశారు. రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పంపన జయలక్ష్మి, కుశిరెడ్డి అప్పలరాజు, వీఆర్వోలు సుభద్రాదేవి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

తుని: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదుకులు, ప్రజలు సహకరించాలని తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.కిరణ్‌కుమార్ కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గొల్ల అప్పారావు సెంటర్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గమనించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సెల్‌ఫోన్ మాటాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. బస్సులను రోడ్డుకు ఎడమ వైపు నడపాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ జీజీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



ఏవీ నగరం పీహెచ్‌సీలో గర్భిణితో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

తొండంగి: గర్భిణులకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా అవగాహన కల్పించేందుకు గాను అడ్వాన్సింగ్ రెడక్షన్ ఇన్ మోర్టాలిటీ, మోర్బిడిటీ ఆఫ్ మదర్స్, చిల్డ్రన్ నియోనేట్స్ (ఆర్మన్) బృందం గురువారం మండలంలోని ఏవీ నగరం పీహెచ్‌సీని పరిశీలించింది. భారతీయ వైద్య విధాన మండలి ఆదేశాల మేరకు డాక్టర్ అనుదీప్తి ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు ఆస్పత్రిలో గర్భిణులకు అందుతున్న సేవలు, హైరిస్క్ కేసులు రికార్డులను పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు పి.భారతి వివరించారు. గర్భిణులు ప్రసవానికి ముందు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర బృంద సభ్యులు వివరించారు. గ్రామాల్లో ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి రూ.6,10,905 ఆదాయం



తంటికొండ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీదారు జీఎస్ వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల తదితరుల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఐదు నెలల పది రోజులకు రూ.6,10,905 ఆదాయం సమకూరినట్టు ఈఓ జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



గోకవరం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డీఎం రామన్నదొర

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించి లాటరీలో గెలుపొందిన వారికి గురువారం డిపో మేనేజర్ యు.రామన్నదొర బహుమతులు అందజేశారు. డిపో పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణించిన వారు తమ టిక్కెట్లను లాటరీ బాక్సులో వేశారు. ఆ టిక్కెట్లుకు లాటరీ తీసి ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. వీరికి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీసాయి జ్యూయలర్స్ అధినేత పి.నాగేంద్ర సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావు, హెచ్‌సీ మంగరాజు, యూనియన్ నాయకులు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, మేడా మురళీశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పేరంటాలమ్మ జాతరకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



నీలాద్రిరావుపేటలో పునర్నిర్మించిన అమ్మవారి ఆలయం.



వీరమ్మ పేరంటాలు అమ్మవారు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ దేవత వీరమ్మ పేరంటాలమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 16వ తేదీ నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరను పరస్కరించుకుని గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. జాతరలో ఆడపడుచులు తమ పుట్టింటికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించడం ఆనవాయితీ. సుమారు 57 ఏళ్లుగా జరుగుతున్న అమ్మవారి జాతరకు గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు.

1968 నుంచి...

నీలాద్రిరావుపేట గ్రామం 1968వ సంవత్సరానికి పూర్వం భయంకరమైన అరణ్యంగా ఉండేది. క్రూర మృగాలు, భూతప్రేత పిశాచీలు, అంటు రోగాలు, అతివృష్టి, అనావృష్టితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పట్లో రథ సప్తమి నాడు తన పుట్టింటి నుంచి అత్తవారి ఇంటికి భర్తతో ఈ మార్గంలో వెళుతున్న వీరమ్మ పేరంటాలు అమ్మవారు నీలాద్రిరావుపేట వచ్చేసరికి ఆమె భర్తకు అనారోగ్యం కలగడంతో ఆ మార్గంలో మర్రి చెట్టు కింద అమ్మవారు ధ్యానం చేయగా భర్త ఆరోగ్యం కుదుటపడింది. గ్రామంలో సమస్యలు తొలగిపోయాయి. అప్పటి నుంచి ఆ చెట్టును వీరమ్మ పేరంటాలు అమ్మవారిగా భక్తులు భావించి పూజలు చేయడం ప్రారంభించారు. ఏటా రథసప్తమికి అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు.

చకచకా ఏర్పాట్లు

అమ్మవారి జాతరకు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు నక్కా సత్తిబాబు తెలిపారు. జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక తాండవ పరిధిలో వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 1 నుంచి 10 వార్డులు, కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజిపేట, సీతారాంపురం, కంకిపాటి వారి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లి కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

కోటనందూరు మండలంలో...

కోటనందూరు: మండలంలోని కోటనందూరు, కేఈ చిన్నయ్యపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి: మండలంలోని ఏవీనగరం, అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. అన్నయ్యపేట సబ్‌స్టేషన్‌లోని జీఎం పేట, పైడికొండ, ఆనూరు, వేమవరం, అద్దరిపేట గ్రామాలు, ఏవీ నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని పెరుమాళ్లపురం, శృంగవృక్షం, సీతారాంపురం గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తుని మండల పరిధిలో...

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరం, డి.పోలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మండలంలోని కేఓ మల్లవరం, రాపాక, డి.పోలవరం, దొండవాక, ఎస్.సూరవరం తదితర గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

జగ్గంపేట మండలంలో...

జగ్గంపేట: మండలంలోని జగ్గంపేట, కాట్రావులపల్లి, రాజపూడి, ఇర్రిపాక సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈ రత్నాలరావు గురువారం తెలిపారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ



కొత్తపల్లి పీహెచ్‌సీలో డీ వార్మింగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరస్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 15,124 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం లక్ష్యమన్నారు. ఇందు కోసం ఇప్పటికే వైద్య సిబ్బందికి మందులు పంపిణీ చేశామన్నారు. లక్ష్యాన్ని నూరుశాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎంపీహెచ్ఈఓలు డీవీఎస్ మూర్తి, ఎస్.భవానీశంకర్, హెచ్‌వీలు అరుణోనమ్మ, రాజేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

తొండంగి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏవీ నగరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ గురువారం తెలిపారు. పీహెచ్‌సి పరిధిలోని 1 నుంచి 19 ఏళ్ల లోపు 2890 మందికి మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అలాగే తొండంగి, రావికంపాడు, కె.పెరుమాళ్లపురం పీహెచ్‌సీల పరిధిలోనూ డీ వార్మింగ్ డేకు ఏర్పాట్లు చేసినట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యులు శిరీష, అర్చన, కోసూరి రవి తెలిపారు.

ధర్మవరం సొసైటీ అధ్యక్షుడిగా 'జువ్వల'



జువ్వల బాబులు, సొసైటీ చైర్మన్, ధర్మవరం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జువ్వల బాబులు నియమితులయ్యారు. సొసైటీ త్రిసభ్య కమిటీకి చైర్మన్‌గా బాబులును నియమిస్తూ రాష్ట్ర సహకార సొసైటీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి (డీసీఓ) బీకే దుర్గాప్రసాద్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు వెంకటేశ్వరరావు (నాని), కిలాడి బాబ్జి నియమితులయ్యారు. సొసైటీ చైర్మన్‌గా నియమితులైన జువ్వల బాబులుకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, ఉప సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల చినబాబు, పార్టీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల దొరబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

సొసైటీ అధ్యక్షుడిగా పర్వత సత్యనారాయణమూర్తి

శంఖవరం: శంఖవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా పర్వత సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా గుద్దాటి నాగేశ్వరరావు, ఈగల గంగ నియమితులయ్యారు. సొసైటీ చైర్మన్‌గా నియమితులైన పర్వత సత్యనారాయణమూర్తికి పలువురు అభినందనలు తెలిపారు.

వీరమ్మ చెరువు కాలువ పరిశీలన



జగ్గంపేటలో పేకేటి వీరమ్మ చెరువు కాలువను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చౌదరి

జగ్గంపేట: వర్షం వస్తే ముంపునకు గురవుతున్న స్థానిక పేకేటి వీరమ్మ చెరువు కాలువ మరమ్మతులు, కాలువలో పూడిక తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తెలిపారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చౌదరి పేకేటి వీరమ్మ చెరువు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో కలెక్టర్ స్పందించి జిల్లా అధికారులను పరిశీలనకు పంపారన్నారు. ముంపు నివారణకు అధికారులు సుమారు రూ.20 లక్షలతో అంచనాలు రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ తరాంజీ, పంచాయతీ కార్యదర్శి గణేష్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ఉపాధి హామీ పథకంలో అర్హులందరికీ పని కల్పించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. కూలీలకు సక్రమంగా పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



జల సంఘాల సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ అన్నారు. మండలంలోని కె.కొత్తూరు, కత్తిపూడి, శంఖవరం, సీతంపేట, కొంతంగి గ్రామాల్లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ వ్యవస్థపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతిఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి ప్రజలకు రక్షిత తాగునీరు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రేమ్‌సాగర్ బాధ్యతల స్వీకరణ



రౌతులపూడి: మండల ఎంపీడీఓగా ఎం.ప్రేమ్‌సాగర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలేశ్వరం ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.గోవింద్ శంఖవరం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.